ప్రజల చేతిలో

www.ayudamdaily.com

ఆయుధం

The Common People's Voice

గురువారం | అక్టోబరు 29, 2026 | సంపుటి : 7 | సంచిక : 124 | పేజీలు : 2

12 మంది ఐఏఎస్‌ల బదిలీ

హైదరాబాద్, ఆయుధం: తెలంగాణలో 12 మంది సీనియర్ ఐఏఎస్లను రాష్ట్ర ప్రభుత్వం బదిలీ చేసింది. అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా జయేష్ రంజన్, విద్యుత్తు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వికాస్రాజ్, క్రీడాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా వాణీ ప్రసాద్, పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నవీన్ మిత్తల్, రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యర్ నియమితులయ్యారు. గవర్నర్ ప్రత్యేక కార్యదర్శిగా ఉన్న దానకిశోర్ పదవీకాలాన్ని పొడిగించారు. గిరిజన సంక్షేమశాఖ ప్రధాన కార్యదర్శిగా రాహుల్ బొజ్జాకు, కోర్ అర్బన్ రీజియన్ ప్రత్యేక అధికారిగా సర్ఫరాజ్ అహ్మద్కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శిగా కె. ఇలంబర్తి, మహిళా సంక్షేమం, ఎస్సీ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా శ్రుతి ఓజా, వైద్యారోగ్యశాఖ డైరెక్టర్ గా ముషారఫ్ అలీని నియమించింది. ఎస్పీడీసీఎల్ ఎండీ జితేష్ పాటిల్కు టీజీ రెడ్కో వీసీగా అదనపు బాధ్యతలు అప్పగించింది.

నీటి నాణ్యతపై రాజీ పడొద్దు

ట్రీటెడ్ వాటర్‌పై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష



హైదరాబాద్, ఆయుధం:

హైదరాబాద్ క్యూర్ పరిధిలో తాగు నీటి సమస్య రాకూడదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భవన నిర్మాణాలకు, మొక్కలు, గార్డెనింగ్ వంటి అవసరాలకు శుద్ధి చేసిన నీటినే వినియోగించాలని సీఎం ఆదేశించారు. ట్రీటెడ్ వాటర్‌పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు.

శుద్ధి చేసిన నీటినే వాడాలి

హైదరాబాద్ కోర్ అర్బన్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ తాగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను రేవంత్ రెడ్డి ఆదేశించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. క్యూర్ ఏరియాలో మంచినీటి సరఫరా, ఎస్టీపీల నిర్మాణం, ట్రీటెడ్ వాటర్ వినియోగంపై ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీ బోధి పెవిలియన్‌లో రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని, క్యూర్ ఏరియాలోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు, ఎస్టీపీలు వంద శాతం సామర్థ్యంతో పనిచేసేలా చూడాలని సీఎం ఆదేశించారు. సెక్రటేరియట్‌తోపాటు సీఎంవో, అవుటర్ రింగ్, మైట్రో రైల్, ఇతర శాఖల కార్యాలయాల్లో పచ్చదనం నిర్వహణ, ఇతర అవసరాలకు శుద్ధి చేసిన నీటిని వినియోగించేలా చూడాలని సీఎం సూచించారు. పబ్లిక్ పార్కులు, రోడ్ల శుభ్రతకు కూడా ట్రీటెడ్ వాటర్‌నే వాడాలన్నారు. భవన నిర్మా ణంలో

మిగతా 2 లో..



తుపానుతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

- ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

అమరావతి, ఆయుధం: అర్నబ్ తుపానుతో పంట, ఆస్తి నష్టపోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్‌లో మీడియాతో మాట్లాడారు.''అర్నబ్ తుపానుపై మూడు రోజులుగా నిరంతర సమీక్షలు చేశాం. తీవ్రత గుర్తించి అవసరమైన చర్యలు చేపట్టాం. పరిస్థితులకు అనుగుణంగా అధికారులను సన్నద్ధం చేశాం. ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా ఇస్తూ పనిచేశాం. సేఫ్, సెక్యూరిటీ, రిహాబిలిటేషన్ అనుసరిస్తూ ముందుకెళ్లాం'' అని చెప్పారు.

''గతంలో తుపానుల వల్ల చాలామంది చనిపోయేవారు. కానీ ఈ తుపాను ప్రభావంతో ఐదుగురే చనిపోయారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. మంగళవారం రాత్రి 11.15 గంటలకు అర్నబ్ తుపాను తీరాన్ని తాకింది. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ నుంచి పక్క రాష్ట్రాలకు వెళ్లింది. దీని ప్రభావంతో ఇంకా కొన్ని జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. కోనసీమ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వాతావరణం అనుకూలించక సహాయక చర్యలు ఆలస్యమవుతున్నాయి. ఆ రెండు జిల్లాలు తప్ప అన్ని జిల్లాల్లో సాయంత్రానికి విద్యుత్తు పునరుద్ధరిస్తాం. గురువారం సాయంత్రం వరకు శ్రీకాకుళం, అల్లూరి, మన్యం, అనకాపల్లి జిల్లాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి'' అని సీఎం సూచించారు.

మృతుల కుటుంబాలకు రూ.5లక్షల సాయం..

''తుపాను మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తాం. శిబిరాల్లోని బాధితులకు రూ.1000 చొప్పున రూ.మూడు వేల వరకు సాయం చేస్తాం. కిరాణా దుకాణాలు, రెస్టరంట్లు దెబ్బతింటే రూ.25 వేలు, రూ.40 లక్షల లోపు టర్నోవర్ ఉన్న ఎంఎస్ఎంఈలకు రూ.50 వేలు, రూ.40 లక్షల నుంచి రూ.కోటిన్నర లోపు టర్నోవర్ ఉన్న వాటికి రూ.లక్ష, రూ.కోటిన్నరకు పైగా టర్నోవర్ ఉన్న ఎంఎస్ఎంఈలకు రూ.1.5 లక్షల సాయం అందిస్తాం. ద్విచక్ర వాహనం దెబ్బతింటే రూ.3 వేలు, త్రిచక్ర వాహనానికి రూ.10 వేల సాయం, దెబ్బతిన్న ఫిషింగ్ బోట్లకు రూ.9 వేలు, వలల మరమ్మతులకు రూ.5 వేలు, వలలు ఉన్న ఫిషింగ్ బోటు దెబ్బతింటే రూ.25 వేల సాయం చేస్తాం'' అని చంద్రబాబు తెలిపారు.



నిరుద్యోగులను వంచించిన కాంగ్రెస్

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యం
- కాంగ్రెస్ వైఫల్యాలపై పట్టభద్రుల ఆగ్రహం..
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు పలకడం ఖాయం
- ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్

వరంగల్, ఆయుధం: కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులను వంచించిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ పేర్కొన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమం 36వ డివిజన్ చింతల్ ప్రాంతంలో ప్రారంభమైంది. బీజేపీ జిల్లా నాయకులు ఆడెపు వెంకటేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వరంగల్-ఖమ్మం-నల్గొండ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన ప్రతి పట్టభద్రునిచే ఓటు నమోదు చేయించే ప్రక్రియను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు గంట రవికుమార్ మాట్లాడుతూ, రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు కీలక పాత్ర పోషించాల్సి ఉందన్నారు. నిరుద్యోగ, విద్యావంతుల సమస్యలపై నిరంతరం పోరాడుతున్న భారతీయ జనతా పార్టీకి మేధావులు, పట్టభద్రుల మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఓటును నమోదు చేసుకోవాలని కోరారు. అనంతరం బీజేపీ నాయకులు ఆడెపు వెంకటేష్ మాట్లాడుతూ, తూర్పు నియోజకవర్గ పరిధిలోని డివిజన్లోని ప్రతి బూత్ లో పట్టభద్రులను కలిసి ఓటరు నమోదుపై అవగాహన కల్పిస్తామన్నారు. ఈసారి ఎన్నికల్లో నియోజకవర్గంలోని పట్టభద్రులంతా బీజేపీకి మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నారని, పార్టీ విజయానికి శ్రేణులన్నీ సమన్వయంతో కృషి చేస్తాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శివనగర్ మండల అధ్యక్షులు మహమ్మద్ రఫీ, మండల బిజెపి నాయకులు శామకూరి నవీన్, దుస్స శ్రీధర్, కందుకూరి విజయ్ కుమార్, డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలి
- అర్నబ్ తుఫాన్ నేపథ్యంలో ములుగు జిల్లా అధికారులకు మంత్రి సీతక్క కీలక ఆదేశాలు



ములుగు, ఆయుధం: అర్నబ్ తుఫాన్ ప్రభావంతో భారీ ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో ములుగు జిల్లా అధికారులను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క అప్రమత్తం చేశారు. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సూచనలు అందిస్తూ, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈదురుగాలుల సమయంలో ప్రజలు చెట్లు, విద్యుత్ స్తంభాలు, శిథిలావస్థలో ఉన్న భవనాల సమీపంలో ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు తక్షణమే స్పందించి ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని మంత్రి సీతక్క అధికారులకు సూచించారు.

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- ఆరోగ్యకరమైన, మత్తు రహిత దేశాన్ని నిర్మిద్దాం
- కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి



హనుమకొండ, ఆయుధం: మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి అన్నారు. యువత, విద్యార్థులు, ప్రజల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, హనుమకొండ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణ నుంచి హనుమకొండ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయం వరకు నిర్వహించిన ఈ ర్యాలీని జిల్లా కలెక్టర్, రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి జెండా ఊపి ప్రారంభించి, స్వయంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని, కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పించాలని, మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. మాదకద్రవ్యాల లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యువత తమ శక్తి, ప్రతిభను విద్య, క్రీడలు, సామాజిక సేవ, దేశ నిర్మాణం వంటి సానుకూల కార్యకలాపాల వైపు మళ్లించాలని సూచించారు. ర్యాలీలో పాల్గొన్న రెడ్‌క్రాస్ పాలకవర్గ సభ్యులు, విద్యార్థులు "మాదకద్రవ్యాలకు నో చెప్పండి - ఆరోగ్యకరమైన జీవితానికి అవును చెప్పండి", "డ్రగ్స్‌కు దూరంగా ఉండండి - దేశాభివృద్ధిలో భాగస్వాములు కండి" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. మాదకద్రవ్యాల అలవాటు వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజం, దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఇ.వి. శ్రీనివాస్ రావు, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, డాక్టర్ సి.హెచ్. సంధ్యారాణి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, డాక్టర్ గొట్టిముక్కల శ్రీలక్ష్మి, పొన్నాల సంయుక్త, రెడ్‌క్రాస్ సిబ్బంది, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పిల్లలను వేధిస్తే.. కఠిన చర్యలు

2 లో

- జడ్జి మధుళిక, డాక్టర్ అనితా రెడ్డి



భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

- కలెక్టర్ చాహత్ బాజ్ పాయి
- ఎన్ హెచ్ 163జి భూసేకరణపై వివిధ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష

హనుమకొండ, ఆయుధం: ఎన్ హెచ్ 163జి పరకాల పరిధిలో మిగిలి ఉన్న భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పరకాల పరిధిలో 163 జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి భూసేకరణ (మిగతా 2 లో..)



వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి ఎన్ఐటీ సాంకేతిక సహకారం

- జీడబ్ల్యూఎంసీ–ఎన్ఐటీ వరంగల్ మధ్య కీలక ఒప్పందం..
- పరిశోధన, నైపుణ్యాభివృద్ధి, ఆధునిక పట్టణ సేవలకు ప్రాధాన్యం

వరంగల్, ఆయుధం: వరంగల్ నగరాన్ని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, మెరుగైన మౌలిక సదుపాయాలతో, సుస్థిర పట్టణంగా తీర్చిదిద్దే లక్ష్యంతో గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ) వరంగల్ మధ్య అవగాహన ఒప్పందం (ఎంఓయూ) కుదిరింది. హనుమకొండ జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ సమక్షంలో బుధవారం ఎన్ఐటీ వరంగల్ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న, ఎన్ఐటీ వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి కలిసి ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ద్వారా ఎన్ఐటీ వరంగల్‌లోని విద్యా, పరిశోధన, సాంకేతిక నైపుణ్యాలను నగర అభివృద్ధి కార్యక్రమాలకు అనుసంధానం చేయనున్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఘన వ్యర్థాల నిర్వహణ, స్మార్ట్ పట్టణ ప్రణాళిక, పర్యావరణహిత అభివృద్ధి వంటి రంగాల్లో సాంకేతిక సలహాలు, వినూత్న పరిష్కారాలను అన్వేషించనున్నారు. జీడబ్ల్యూఎంసీ ఇంజినీర్లు, వివిధ విభాగాల అధికారులకు ప్రత్యేక శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలతో పాటు అర్హులైన ఉద్యోగులకు ఉన్నత విద్యావకాశాలను పరిశీలించనున్నారు.

జిల్లా కలెక్టర్, జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ, నగరాభివృద్ధిలో సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన, నిపుణుల సూచనలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ప్రముఖ విద్యాసంస్థల పరిజ్ఞానాన్ని పట్టణ పరిపాలనతో అనుసంధానం చేయడం ద్వారా నగర సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారాలను కనుగొనవచ్చన్నారు. (మిగతా 2 లో..)

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి

సమన్వయంతో పనిచేయాలి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేతా
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



హనుమకొండ, ఆయుధం; విద్యార్థులను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచడంతో పాటు, బడి బయట ఉన్న పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత.జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి పేర్కొన్నారు. హనుమకొండ కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి చైర్ పర్సన్‌గా బుధవారం మాదక ద్రవ్యాల నియంత్రణ, అరికట్టడంపై నిర్వహించిన సమన్వయ సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా మాట్లాడుతూ... డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం అన్ని ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం ప్రపంచవ్యాప్తంగా ఆందోళనకరంగా విస్తరిస్తున్న నేపథ్యంలో యువతను ఈ ముప్పు నుంచి కాపాడేందుకు పాఠశాల స్థాయి నుంచే విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించి, వాటికి దూరంగా ఉండేలా చైతన్యపరచాలని సూచించారు.

బడి బయట ఉన్న పిల్లలను తిరిగి విద్యావ్యవస్థలోకి తీసుకురావాలి నయీ కిరణ్, విద్యాప్రేరణ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించడంతో పాటు, చదువుకు దూరమైన విద్యార్థులను గుర్తించి తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ సూచించారు. విద్యార్థులు విద్యకు దూరం కాకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలని పేర్కొన్నారు. ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్ వంటి కార్యక్రమాల ద్వారా బాలల సంరక్షణ, రక్షణ, పునరావాసం దిశగా సత్ఫలితాలు సాధిస్తున్నామని తెలిపారు. బాలల హక్కులను పరిరక్షిస్తూ, బడి బయట ఉన్న పిల్లలను తిరిగి విద్యావ్యవస్థలోకి తీసుకురావడంలో సంబంధిత శాఖలు మరింత చొరవ చూపాలని సూచించారు.

సమష్టి కృషితోనే డ్రగ్స్ రహిత సమాజం

మాదకద్రవ్యాల నియంత్రణ కేవలం పోలీసు శాఖ బాధ్యత మాత్రమే కాదని, విద్యాశాఖ, ఎక్సైజ్ శాఖ, అటవీ శాఖ, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు సమిష్టిగా (మిగతా 2 లో..)



నీటి నాణ్యతపై రాజీ పడొద్దు

(మొదటి పేజీ తరువాయి..)
శుద్ధి చేసిన నీటినే వాడాలనే నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. ప్రైవేట్ ఎస్టీపీల ఏర్పాటును ప్రోత్సహించాలని, డేటా సెంటర్లకూ శుద్ధి చేసిన నీటినే సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. ఎస్టీపీల నిర్వహణకు సోలార్ విద్యుత్‌ను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని ముఖ్యమంత్రి రెడ్కో ఉన్నతాధికారులను ఆదేశించారు.

టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలి

ఎస్టీపీల్లో నీటి శుద్ధికి అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలు పాటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. నీటి నాణ్యత విషయంలో ఏ మాత్రం రాజీ పడొద్దన్నారు. ప్రతి శుద్ధి కేంద్రం వద్ద ప్రత్యేక అధికారిని నియమించాలని, అన్ని ప్లాంట్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌తో అనుసంధానించి, నిరంతరం పర్యవేక్షించాలని సీఎం ఆదేశించారు. ఈ కేంద్రాల పనితీరును హైడ్రా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసే ట్యాంకర్లను ట్రాక్ చేసే వ్యవస్థను ఏర్పాటు చేయాలని, ఈ నీటి వినియోగంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సీఎం సూచించారు. ట్రీటెడ్ వాటర్ కోసం ప్రత్యేక టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలన్నారు.
ఎస్టీపీల నిర్వహణ, ట్రీటెడ్ వాటర్ వినియోగానికి సంబంధించి నవంబర్ 1 నుంచి ఆదేశాలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రస్తుతం 26 ఎస్టీపీల్లో ట్రీటెడ్ వాటర్‌ను గ్రీన్ ట్యాంకర్స్ ద్వారా పంపిణీ చేస్తున్నట్లు జలమండలి అధికారులు రేవంత్ రెడ్డికి తెలిపారు. వినియోగదారుల నుంచి కేవలం రవాణా రుసుం మాత్రమే వసూలు చేస్తున్నామని, నీళ్లను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు మాణిక్ రాజ్, నవీన్ నికోలస్, సృజన, వినయ్ కృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, జితేష్ వి.పాటిల్, రవి, ముకుందరెడ్డి సహా ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి
ఎన్ఐటీ సాంకేతిక సహకారం

(మొదటి పేజీ తరువాయి..)
ఈ భాగస్వామ్యాన్ని సమర్థంగా వినియోగించుకొని మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు మరింత నాణ్యమైన పౌర సేవలు అందించే దిశగా కృషి చేయాలని సూచించారు. వరంగల్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుధి మాట్లాడుతూ, విద్యాసంస్థలు, పట్టణ స్థానిక సంస్థల మధ్య సమన్వయం బలోపేతం కావడం ద్వారా నగర అభివృద్ధికి అవసరమైన వినూత్న పరిష్కారాలను రూపొందించవచ్చని అన్నారు. ప్రత్యేక స్వల్పకాలిక కోర్సులు, సాంకేతిక శిక్షణ కార్యక్రమాలు, పరిశోధన ఆధారిత పరిష్కారాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న మాట్లాడుతూ, ఎన్ఐటీ వరంగల్‌తో కుదిరిన ఈ ఒప్పందం నగర అభివృద్ధికి సాంకేతికంగా మరింత బలాన్ని చేకూరుస్తుందని తెలిపారు. నగరంలో ఎదురయ్యే పట్టణ సమస్యలకు శాస్త్రీయ, సాంకేతిక పరిష్కారాలను అన్వేషించేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందన్నారు. మున్సిపల్ ఇంజినీర్లు, అధికారులు, సిబ్బందికి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా పనితీరును మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. ఎన్ఐటీ నిపుణుల సలహాలు, పరిశోధన ఫలితాలను అభివృద్ధి కార్యక్రమాల్లో వినియోగించుకొని, పనుల నాణ్యతను పెంచుతూ పౌరులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఎన్ఐటీ వరంగల్ డిప్యూటీ డైరెక్టర్ ప్రొఫెసర్ రతీష్ కుమార్ కూడా ఈ భాగస్వామ్యాన్ని స్వాగతించారు. జీడబ్ల్యూఎంసీ పరిపాలనా అనుభవం, ఎన్ఐటీ వరంగల్ సాంకేతిక నైపుణ్యం కలిసివచ్చే ఈ భాగస్వామ్యం నగర మౌలిక సదుపాయాల బలోపేతం, ఉద్యోగుల సామర్థ్య పెంపు, సమర్థవంతమైన పట్టణ నిర్వహణకు దోహదపడనుంది. పరిశోధన, సాంకేతిక పరిజ్ఞానం, ప్రజా అవసరాలను సమన్వయం చేస్తూ వరంగల్ నగరాన్ని సుస్థిర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లేందుకు ఈ ఒప్పందం కీలక అడుగుగా నిలవనుంది. ఎన్ఐటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ప్రొఫెసర్ ఎస్. శంకర్, ప్రొఫెసర్ ఎం. శశి ఈ ఒప్పందం రూపకల్పన, సమన్వయంలో కీలక పాత్ర పోషించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ సూపరింటెండెంట్ ఇంజనీర్ రాజ్ కుమార్, సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంటెంట్ జనార్దన్, అకౌంట్స్ ఆఫీసర్ శివలింగం, అన్ని విభాగాల అధికారులు ఎన్ఐటీ వరంగల్ విభాగాధిపతులు, డీన్లు, సీనియర్ విద్యా, పరిపాలనా అధికారులు, జీడబ్ల్యూఎంసీ వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



అమరావతి, ఆయుధం: ఆంధ్రప్రదేశ్‌లో ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల పోలింగ్ తేదీ మారుస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. వచ్చే నెల 3న నిర్వహించాల్సిన పోలింగ్ 5వ తేదీకి, ఓట్ల లెక్కింపు 5 నుంచి 7వ తేదీకి వాయిదా వేస్తూ రాష్ట్ర ఎన్నికల సంఘం బుధవారం ప్రకటన విడుదల చేసింది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ఈ నెల 28 నుంచి వచ్చే నెల 1వ తేదీకి, ఓట్ల లెక్కింపు 30 నుంచి 3కు ఎన్నికల సంఘం ఇటీవల వాయిదా వేసిన విషయం తెలిసిందే. ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం 3వ తేదీన పరిషత్ పోలింగ్ ఉన్నందున.. ఎన్నికల నిర్వహణ పరంగా తలెత్తే ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని పరిషత్ ఎన్నికల పోలింగ్, ఓట్ల లెక్కింపు తేదీలు వాయిదా వేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. స్థానిక ఎన్నికలపై ముందుకెళ్లాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించిన విషయం తెలిసిందే.

ప్రతిదాన్నీ రాజకీయం చేయడం మానుకోండి

■ రాహుల్‌కు నిర్మలా సీతారామన్ కౌంటర్

ఢిల్లీ, ఆయుధం: టాటా గ్రూప్ వ్యవహారంలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తప్పుబట్టారు. ప్రతిదాన్నీ రాజకీయం చేయాలని చూడొద్దని హితవు పలికారు. విద్వేషాలను రెచ్చగొట్టే విషయంలో తనతో కలిసి రావాలని వ్యాపారవేత్తలను ఉసిగొల్పేలా రాహుల్ వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. టాటా గ్రూప్‌ను నాశనం చేస్తున్నారని, ఏ వ్యాపారీ మాట్లాడే ధైర్యం కూడా చేయలేకపోతున్నారంటూ రాహుల్ గాంధీ విమర్శలపై నిర్మలా సీతారామన్ ఎక్స్ వేదికగా స్పందించారు.
పరిశ్రమలను, పారిశ్రామికవేత్తల విజయాలను రాహుల్ గాంధీ పదేపదే తక్కువ చేసి చూస్తున్నారని నిర్మలా సీతారామన్ అన్నారు. మోదీ ప్రభుత్వం పరిశ్రమలను ఉద్యోగ సృష్టికర్తగా, ఆర్థిక వృద్ధి చోదకంగా పరిగణిస్తుందని అన్నారు. వ్యాపారాలను, పెట్టుబడులను ప్రోత్సహించడం, పరిశ్రమకు మద్దతు ఇవ్వడం తమ విధానమని పేర్కొన్నారు. ''ప్రతిపక్ష నేతగా మీరు ప్రతి అంశాన్ని రాజకీయం చేయొద్దు. వాణిజ్య, న్యాయపరమైన అంశాలను నేరపూరితమైనవిగా ముద్ర వేయడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. భారత పరిశ్రమ, మన పారిశ్రామికవేత్తల విజయాలను పదేపదే విమర్శించారు. ఇప్పుడు, అపనమ్మకాన్ని, విద్వేషాన్ని వ్యాప్తి చేయడంలో కలిసి రావాలని వ్యాపారవేత్తలను రెచ్చగొడుతున్నారా? లైసెన్స్ కోటా రాజ్ పేరుతో దశాబ్దాల పాటు మీ పార్టీ పారిశ్రామికవేత్తల స్ఫూర్తిని అణచివేసింది. కోట్లాది మంది భారతీయులపై పేదరికాన్ని రుద్దింది'' అని నిర్మలా సీతారామన్ విమర్శించారు.

సామాజిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొని
వ్యసనాలకు 'నో' చెప్పాలి

- చదువుతో పాటు క్రీడలు, పౌష్టికాహారంతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి
- పాఠశాల దశ నుంచే మంచి అలవాట్లతో ఆరోగ్యకరమైన జీవితానికి పునాది వేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



(ములుగు, ఆయుధం)
విద్యార్థులు సామాజిక ఒత్తిళ్లను ధైర్యంగా ఎదుర్కొని, చెడు వ్యసనాలకు 'నో' అని స్పష్టంగా చెప్పే గుణాన్ని అలవర్చుకోవాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రీడలు, పౌష్టికాహారంతో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్రవ్యాప్త ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అవగాహన కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్ నుండి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా వర్చువల్ విధానంలో ప్రసంగించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా మాట్లాడుతూ, మత్తుపదార్థాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మత్తురహిత సమాజ నిర్మాణాన్ని ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. బుధవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో కలసి సందేశాన్ని వీక్షించారు. అనంతరం కలెక్టర్ నషా ముక్త్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల దశ నుంచే మంచి అలవాట్లను పెంపొందించుకుని ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది వేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. పాఠశాల, కళాశాల దశల్లో స్నేహితుల ప్రభావంతో సరదాగా ఒక్కసారి ప్రయత్నిద్దామనే ఆలోచనతో మత్తుపదార్థాలు, ఇతర హానికరమైన వ్యసనాల వైపు వెళ్లవద్దని హితవు పలికారు. ప్రారంభ దశలోనే వాటికి దూరంగా ఉండటం భవిష్యత్తులోనూ వ్యసనరహిత జీవితాన్ని కొనసాగించేందుకు దోహదపడుతుందని తెలిపారు. 'ఒక్కసారి ప్రయత్నిస్తే ఏమీ కాదు.. మేమూ చేస్తున్నాం.. మాకు ఎలాంటి ఇబ్బంది లేదు' అంటూ స్నేహితులు ఒప్పించే ప్రయత్నం చేసినా ప్రభావితం కావద్దని సూచించారు. తోటి వారిలో కొందరు అలాంటి అలవాట్లకు లోనైనా, వారితో కలవాలనే ఒత్తిడితో వాటిని అనుసరించవద్దని పేర్కొన్నారు. స్నేహం పేరుతో బలవంతం చేసినా తమ నిర్ణయంపై దృఢంగా నిలబడాలని, స్పష్టంగా తిరస్కరిస్తే క్రమంగా ఇతరులు కూడా ఒత్తిడి చేయడం మానుకుంటారని వివరించారు. చెడు వ్యసనాలకు 'నో' చెబుతూ, క్రీడలతో సన్మార్గంలో పయనించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. విద్యార్థులు చదువుకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ప్రతిరోజూ క్రీడలు, శారీరక శ్రమకు సమయం కేటాయించాలని సూచించారు. క్రికెట్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బ్యాడ్మింటన్ వంటి తమకు ఇష్టమైన క్రీడల్లో పాల్గొనాలని, నడక, పరుగు వంటి వ్యాయామాలను అలవాటు చేసుకోవాలని తెలిపారు. క్రమం తప్పని శారీరక శ్రమ వల్ల శరీరం చురుగ్గా ఉండటంతో పాటు మానసిక ఉల్లాసం పెరుగుతుందని, చదువుపై ఏకాగ్రతకు దోహదపడుతుందని పేర్కొన్నారు. మార్కులు, భవిష్యత్తు గురించి అనవసర ఆందోళనకు గురికాకుండా ప్రతిరోజూ చేయాల్సిన పనులు, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. పౌష్టికాహారం, నిత్య వ్యాయామం, తగిన నిద్రను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఈ అలవాట్లను పాఠశాల, కళాశాల దశలకే పరిమితం చేయకుండా ఉన్నత విద్య, ఉద్యోగ జీవితంలోనూ నిరంతరం కొనసాగించాలని సూచించారు. శారీరక చురుకుదనం ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులు చెప్పిన విషయాలను శ్రద్ధగా విని, ఆలోచించి, ఆచరణలో పెట్టేందుకు ప్రయత్నిస్తారని, అందుకే వారితో సంభాషించడం తనకు ఇష్టమని కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో తెలియజేసిన అంశాలపై ఆలోచించి, వాటి ప్రయోజనాలను గుర్తించి, మంచి అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ అల్లం అప్పయ్య, వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, సెక్రటరీ రాజి రెడ్డి, కోశాధికారి శిరుప సతీష్ కుమార్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, విద్యార్థిని విద్యార్థులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను వేధిస్తే కఠిన చర్యలు

■ జడ్జి మధులిక, డాక్టర్ అనితా రెడ్డి



హనుమకొండ, ఆయుధం: పిల్లలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవని ఆరవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మధులిక తేజ, అనురాగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు, పోష్ చట్టం ఎక్స్‌టర్నల్ కమిటీ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ హన్మకొండ ఆధ్వర్యంలో బుధవారం హంటర్ రోడ్డు దగ్గర శాయంపేట ప్రాంతంలోని మైనారిటీ బాలికల ఆశ్రమ పాఠశాలలో పోక్సో చట్టం 2012 పై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా ఆరవ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి మధులిక తేజ, విశిష్ట అతిథిగా అనురాగ్ సొసైటీ చైర్మన్ కాకతీయ విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యులు, పోష్ చట్టం ఎక్స్టర్నల్ కమిటీ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి పాల్గొని పిల్లలకు పోక్సో చట్టం పై అవగాహన కల్పించారు. అతిథులు మాట్లాడుతూ చట్టం (POCSO Act) అనేది 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న బాలురు, బాలికలపై జరిగే లైంగిక వేధింపులు, లైంగిక దాడి, అశ్లీలత వంటి నేరాల నుండి చిన్నారులకు రక్షణ కల్పించే ప్రత్యేక భారతీయ చట్టం అని తెలిపారు. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం (Protection of Children from Sexual Offences Act, 2012) అన్నారు. 18 సంవత్సరాల వయస్సు నిండని ప్రతి ఒక్కరూ (అమ్మాయి లేదా అబ్బాయి) ఈ చట్టం ప్రకారం 'పిల్లవాడు' కిందే వస్తారు, వీరిని ఇబ్బంది పెడితే కఠినమైన శిక్షలు పడతాయని అన్నారు. పిల్లలు అపరిచితులతో స్నేహం చేయవద్దని, ప్రేమ పేరుతో మోస పోవద్దని తెలిపారు. టీచర్స్ చదువు తోపాటు పిల్లలకు మంచి నడవడిక, చట్టాల పై, గుడ్ టచ్ బాడ్ టచ్ పై అవగాహన కల్పించాలని అన్నారు. పిల్లలు ఏ సమస్య వచ్చినా 112 లేదా 1098 నెంబర్లకు ఫోన్ చేయాలని, తల్లి దండ్రుల తో ప్రతి విషయం పంచుకోవాలని, తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయించాలని, పిల్లల రోజు వారి కార్యక్రమాలపై నిఘా ఉండాలని జడ్జి మధులిక, డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. అనంతరం పిల్లలచే అపరిచితులతో సావాసం చేయం, ప్రేమ ఉచ్చులో పడం, ఎవరైనా ఇబ్బంది పెడితే ధైర్యంగా ఎదుర్కొంటామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జడ్జి మధులిక, డాక్టర్ అనితా రెడ్డి, కేయు ఎస్.ఐ. శ్రావణి, లీగల్ కౌన్సిలర్ రవి, ప్రిన్సిపాల్ నీరజ, టీచర్స్ పిల్లలు పాల్గొన్నారు.

గొల్లకురుమలకు 50 ఏళ్లకే పింఛన్ ఇవ్వాలి



హైదరాబాద్, ఆయుధం: గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు అన్నారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ అధ్యక్షతన రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర కార్యాలయం డాక్టర్ రాజా బహదూర్ గౌర్ విజ్ఞాన్ కేంద్రం హిమాయత్ నగర్ హైదరాబాద్ లో జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా వృత్తి సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపాముల వెంకట్రాములు హాజరై మాట్లాడుతూ.. చేనేత, గీత వృత్తిదారులకు ఇచ్చినట్లుగా గొల్ల కురుమలకు 50 సంవత్సరాలకు పెన్షన్ ఇవ్వాలని, ఆసరా పెన్షన్ ను రూ.5 వేలకు పెంచి అమలు జరపాలన్నారు. సమస్యల పరిష్కారానికై వృత్తిదారులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశ జనగణనలో కులగణన చేయకుండా మోసం చేస్తున్నదన్నారు. కులగణన నిర్వహించి కులాల లెక్కలు తీసి జనాభా ప్రాతిపదికన వారి అభివృద్ధికి సంక్షేమానికి పాటుపడాలని, లేకుంటే బీసీ ఉద్యమాలను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంతరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్ మాట్లాడుతూ గొర్రెలు మేకలని అడవిలో మేపుకొనుటకు కేంద్ర ప్రభుత్వం పాలసీ ప్రకటించాలని, దానికి రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలని నేషనల్ లైవ్ స్టాల్ మిషన్ 5 లక్షల నుండి 10 లక్షల లోపు ఎలాంటి షరతులు లేకుండా గొల్ల కురుమలకు రుణాలు మంజూరు చేయాలని, రాష్ట్ర కేబినెట్ లో గొల్ల కురుమలకు మంత్రి వర్గంలో స్థానం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోడంగి శ్రావణ్ కుమార్ యాదవ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కటిక రెడ్డి, బుచ్చన్న యాదవ్, బాలయ్య యాదవ్, జిల్లాల అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్, గజ్జి రమేష్ యాదవ్, వేల్పుల సారంగపాణి యాదవ్, అందే అశోక్ యాదవ్, సంఘం నాయకులు మద్దూరి గట్టయ్య, దాడి రాజబాబు యాదవ్, కేశవేణి సత్యనారాయణ యాదవ్, పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జూడో వేడుకలు

- మహిళల ఆత్మరక్షణకు జూడో ఎంతో కీలకం
- ప్రతి యువతి జూడో నేర్చుకోవాలి
- తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షులు కైలాష్ యాదవ్



వరంగల్, ఆయుధం: ప్రపంచ జూడో దినోత్సవాన్ని పురస్కరించుకొని వరంగల్ నగరంలోని కొత్తవాడ ప్రాంతంలో ఉన్న కెమిస్ట్ భవన్‌లో వరంగల్ జిల్లా జూడో అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ జూడో దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ అధ్యక్షులు కైలాష్ యాదవ్ హాజరై జూడో క్రీడ ప్రాముఖ్యతను, దాని ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా కైలాష్ యాదవ్ మాట్లాడుతూ జూడో క్రీడకు పితామహుడిగా ప్రసిద్ధి చెందిన జిగోరో కానో జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రపంచ జూడో దినోత్సవాన్ని జరుపుకుంటామని తెలిపారు. జిగోరో కానో ప్రవేశపెట్టిన జూడో క్రీడ నేడు ప్రపంచవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందడంతో పాటు ఒలింపిక్ క్రీడల్లోనూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుందని పేర్కొన్నారు. జూడో కేవలం ఒక క్రీడ మాత్రమే కాదని, వ్యక్తిత్వ వికాసానికి, క్రమశిక్షణకు, ఆత్మవిశ్వాసానికి, శారీరక దృఢత్వానికి దోహదపడే గొప్ప సాధనమని అన్నారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, యువతుల భద్రతకు ఆత్మరక్షణ నైపుణ్యాలు ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. ప్రతి మహిళ, ప్రతి యువతి జూడో వంటి ఆత్మరక్షణ క్రీడలను నేర్చుకోవాలని సూచించారు. జూడో శిక్షణ ద్వారా ఆపద సమయంలో ధైర్యంగా వ్యవహరించే సామర్థ్యం పెరుగుతుందని, శారీరకంగా, మానసికంగా దృఢంగా తయారవడానికి అవకాశం ఉంటుందని వివరించారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థులకు జూడోపై ఆసక్తి కల్పించి, పాఠశాల స్థాయిలోనే శిక్షణ అందిస్తే భవిష్యత్తులో మంచి క్రీడాకారులను తీర్చిదిద్దవచ్చని తెలిపారు. జూడో క్రీడ భారతదేశంలో అభివృద్ధి చెందిన తీరును ప్రస్తావిస్తూ, ఈ క్రీడ దేశవ్యాప్తంగా విస్తరించడంలో వివిధ ప్రాంతాల క్రీడా సంస్థలు, శిక్షకులు కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనూ జూడో క్రీడకు మంచి ఆదరణ లభిస్తోందని, ఉమ్మడి పది జిల్లాల్లో ఈ క్రీడ కొనసాగుతూ క్రీడాకారులకు అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి సరైన శిక్షణ, ప్రోత్సాహం అందిస్తే రాష్ట్రానికి మరిన్ని విజయాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల న్యూఢిల్లీలోని త్యాగరాజ్ స్టేడియంలో నిర్వహించిన 70వ జాతీయ పాఠశాలల క్రీడా పోటీల్లో అండర్-14 జూడో విభాగంలో తెలంగాణకు చెందిన జి. నవీన్ అనే క్రీడాకారుడు 30కిలోల విభాగంలో కాంస్య పతకం సాధించడం రాష్ట్రానికి గర్వకారణమని కైలాష్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన క్రీడాకారుడు జి. నవీన్‌ను, అతనికి శిక్షణ అందించిన కోచ్ సాయిరాం యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. క్రీడాకారుల విజయాల వెనుక కోచ్‌ల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం, క్రీడా సంఘాల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. . ఈ కార్యక్రమంలో తెలంగాణ జూడో అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిహెచ్. సోమరాజు, తెలంగాణ రాష్ట్ర జూడో అసోసియేషన్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి దుపాకి సంతోష్ కుమార్, వరంగల్ జిల్లా జూడో సభ్యులు తుమ్మల భాస్కర్, నిశాంత్, వల్లెం సుధాకర్ చంద్రమోహన్, క్రీడాభిమానులు సంపత్, దాసారపు సారన్న, కర్ణాకర్, కిషోర్, అరవింద్, శిరీష్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్ శాఖలో ఔట్ సోర్సింగ్
ఉద్యోగాలకు దరఖాస్తులు

వరంగల్, ఆయుధం: జాతీయ ఆయుష్ మిషన్ పథకం కింద వరంగల్ జిల్లా ఆయుష్ శాఖలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన ఖాళీగా ఉన్న 12 పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయుష్ విభాగం వరంగల్ జిల్లా నోడల్ అధికారి మైదం రాజు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ అర్హత కలిగిన ఆయుష్ డాక్టర్ 1, ఆయుష్ మెడికల్ ఆఫీసర్ 4, డైటీషన్ 1, సైకోసోషల్ కౌన్సిలర్ 1, యోగ ప్రొఫెషనల్ శిక్షకులు 1, మల్టిపుల్ పాస్ వర్కర్ 4, పోస్టులకు సంబంధించి దరఖాస్తులు ఈ నెల 31వ తేదీ వరకు వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించబడుతాయని ఆయన తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి
సమన్వయంతో పనిచేయాలి

(మొదటి పేజీ తరువాయి..)
కృషి చేయాలని కమిషనర్ పిలుపునిచ్చారు. విద్యార్థుల ప్రవర్తనలో అనుమానాస్పద మార్పులను గుర్తించి, అవసరమైనప్పుడు సంబంధిత అధికారులకు సమాచారం అందించడం ద్వారా మాదకద్రవ్యాల వ్యాప్తిని అరికట్టేందుకు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన, నియంత్రణకు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో డ్రాపౌట్స్ పై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. నిరంతరం పాఠశాలకు గైర్హాజరు అవుతున్న విద్యార్థుల పట్ల పర్యవేక్షణ చేయాలన్నారు. పాఠశాలకు హాజరు కాకపోవడానికి గల కారణాలను విశ్లేషణ చేయాలన్నారు. డ్రగ్స్ నియంత్రణ చర్యలను చేపట్టేందుకు నిర్వహించే సమావేశాలలో తప్పనిసరిగా ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల అసోసియేషన్ల ప్రతినిధులు పాల్గొనేవిధంగా అధికారులు సమాచారం అందించాలన్నారు.
ఈ సమావేశంలో సెంట్రల్ జోన్ డిసిపి దార కవిత, ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ నవీన్ కుమార్, డిఆర్ఓ శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్. వి.గిరిరాజ్ గౌడ్, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డిఎస్ వెంకన్న, ఎక్సైజ్, అటవీ శాఖల, ఉన్నతాధికారులు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రైవేట్ పాఠశాలల సంఘాల ప్రతినిధులు, సంబంధిత విద్యాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియను
వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి..)
ప్రక్రియలో పెండింగ్‌లో ఉన్న అంశాలపై ఎన్ హెచ్, రెవెన్యూ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భూసేకరణకు సంబంధించిన పెండింగ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించి, ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఎన్ హెచ్ పీడీ భరద్వాజ్ , మేనేజర్ లింగయ్య, పరకాల ఆర్డీవో డీఎస్ వెంకన్న, పరకాల, శాయంపేట, దామెర తహసీల్దార్లు విజయలక్ష్మి, ప్రవీణ్ కుమార్, జ్యోతి వరలక్ష్మి దేవి , భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, తదితరులు పాల్గొన్నారు.

తుపాను వేళ జననం..

■ అర్నబ్‌గా నామకరణం

ఒడిశా, ఆయుధం; బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్నబ్' తుపాను ప్రభావంతో ఒడిశాలోని గంజాం జిల్లాలో రెండ్రోజులుగా బలమైన ఈదురు గాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలు అతలాకుతలం అయ్యాయి. తుపాను ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ప్రసూతి తేదీకి దగ్గరగా ఉన్న గర్భిణులను సమీపంలోని ఆసుపత్రులు, ఆరోగ్య కేంద్రాలు, ప్రత్యేక శిబిరాలకు తరలించింది. పాత్రపురం సమితి బురాతాల్ పంచాయతీలోని కొండపై ఉన్న గ్రామాలకు చెందిన 16 మంది గర్భిణులను పాత్రపురం ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వీరిలో అన్నుప గ్రామానికి చెందిన గర్భిణి మంగళవారం ఆరోగ్య కేంద్రంలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. తుపాను వేళ బిడ్డ జన్మించడంతో కుటుంబ సభ్యులు 'అర్నబ్'గా నామకరణం చేశారు. పసికందుకు అదే పేరుతో జనన ధ్రువీకరణ పత్రం అందజేసినట్లు ఆరోగ్య కేంద్రం ఇన్‌ఛార్జి వైద్యుడు సంబిత్ బేగ్రాయ్ తెలిపారు.

Edited, Printed, Published and Owned by **V.P.CHANDER.** On Behalf of **VNR MEDIA**. Printed at Pragathi Graphics # 6-8-231, Sagara Veedhi, Hanumakonda.
Published at 2-2-414, Nayeem Nagar, Hanumakonda, TS-506001. RNI: TEL TEL 2019/78717, Email: ayudamdaily@gmail.com. Contact: 98480-15695